# ఆగమ శాస్త్రమంటే ఏమిటి?

ఇప్పటి కాలములో ఉన్న అద్వైత విశిష్టాద్వైత పీఠములు వెలియకనే కృతయుగము మొదటి భాగకాలము లోనే దేవాలయములు నిర్మింపబడినవి. ఆనాటి దేవాలయ నిర్మాణము గొప్ప ఉద్దేశముతో మానవునికి దైవజ్ఞానము తెలియజేయు ప్రాధాణ్యతతో కూడుకొన్నదై ఉన్నది. ఆనాడు ఈనాటి ఆగమ శాస్త్రమనునది లేనేలేదు. దేవాలయములో ప్రతి మలుపు అర్థముతో కూడుకొన్న సంజ్ఞారూపమై ఉండెడిది. దాని ప్రకారమే ఆలయములో ఆరాధనలు కూడ జరిగెడివి. ఆనాటి ఆలయములు అర్చనలు విశిష్టమైన భావయుక్తమై ఉండగ, నేడు ఆలయములలోను అర్చనలలోను కొన్ని మార్పులు వచ్చి అధర్మయుక్తమై పోయాయి. అసలు ధర్మమంటే ఏమిటో తెలియని స్థితిలో కొందరు ఆగమ శాస్త్రమును తయారు చేసుకొన్నారు. ప్రపంచములో ఉన్నవి ఆరుశాస్త్రములే అయినప్పటికి వాటిని విస్మరించి వాస్తుశాస్త్రము, ఆగమశాస్త్రము అని కోకొల్లలుగ శాస్త్రములని పేరు పెట్టుకొన్నవి బయటికి రావడము విచిత్రము. శాస్త్రమంటే ఏమిటో? ధర్మమంటే ఏమిటో తెలియని వారు మమ్ములనడుగు వారే లేరన్నట్లు ఇష్టమొచ్చిన పద్ధతులను సృష్ఠించుకొని అసలు ధర్మములను మరచి శైవులమని, వైష్ణవులమని వాధించుకొనుచున్నారు. కృత, త్రేతా, ద్వాపర యుగములలో లేని శైవులు వైష్ణవులు కలియుగములో తయారైనారు.

సాధారణ మనుషులను దైవత్వము వైపు పంపవలసిన పీఠాధిపతులు నేడు తిరుపతి తిరుమల దేవస్థానమును గురించి బేధాభిప్రాయములు కల్గియుండడము, వైష్ణవ పీఠాధిపతి చినజియార్ స్వామి శైవులైన వారికి తిరుమలలో పూజావిధానముపై వాఖ్యానించే హక్కులేదని అనడము శోచనీయమే. ఆగమశాస్త్రము ప్రకారము తిరుమలలో పూజా కార్యములు జరుగలేదనడము. ఆగమ సలహామండలిని రద్దుచేసి సాంప్రదాయమండలి అను క్రొత్తపేరుతో కమిటీని వేయాలనుకోవడము మాకు విచిత్రముగ తోచుచున్నది. అటు పాలకులకు ఇటు ప్రజలకు ధర్మములు శాస్త్రములు ఏమిటో తెలియదు, కావున పీఠాధిపతులైన స్వాములు వారి ఇష్టమొచ్చినట్లు చెప్పుచు పోవుచున్నారు. వీరు చెప్పే విధానమువలన సమాజములోని మనుషులలో మార్పు రాకపోగ పీఠాధిపతుల ఆధిపత్యము పెరుగుచున్నది.

అద్వైతులు ధరించే విభూతిరేఖలు, విశిష్టద్వైతులు ధరించే నామములు కృతయుగములోనే నెలకొల్ప బడినవి. ఆనాడు ఎలా ఏ ఉద్దేశముతో ధరించారో కూడ తెలియనివారు నేడు మేము పెద్దలమని, దేవాలయములలో అర్చనలు ఈ విధముగ ఉండవలెనని చెప్పడము చాలా విచిత్రము. తిరుపతి కొండమీద హెలిపాడ్ నిర్మించకూడదని, దేవతలకు హెలీకాప్టర్లు అడ్డమొస్తాయనడము ఇతర మతస్తుల ముందర ఇందూసాంప్రదాయములు అవహేళన కావలసివస్తున్నది. ఇందూసాంప్రదాయములు, ఇందూ ధర్మముల విషయమే తెలియనివారు సంస్కృత భాషలో పాండిత్యము గడించి ఆ భాషను అడ్డము పెట్టుకొని మేము చెప్పునవన్ని ధర్మములు సాంప్రదాయములనడము చాలా పొరపాటు.

దేవుడు తన ధర్మములను కాపాడుకొనుటకు తన అనుచరులను తప్పక ప్రేరేపిస్తాడు. అదే ప్రేరణలో మేము అడుగుచున్నదేమనగా! అద్వైతుల పంచాక్షరికి, విశిష్టద్వైతుల అష్టాక్షరికి ఆయా పీఠాధిపతులు వివరము హేతుబద్ధముగ చెప్పగలరా? ఆగమశాస్త్రమును ఎవరు తయారు చేశారు? అదిశాస్త్రమేనా? అది మానవునకి దైవరాధనలో కొంతయిన ఉపయోగపడుతుందా? హిందువులు ఇతర మతములలోనికి పోతూవుంటే ఏమి చేయలేని పీఠాధిపతులు దేవాలయ విషయములలో వాదులాడడమెందుకు. ఆనాటి సనాతన ధర్మములుగాని,

నేటి పెళ్లి విధానములోని ఆచరణ, అర్థములుగాని మనుషులకు తెలుపలేని వారు ధర్మ ప్రచారము చేయడమేమిటి? వారికి ప్రచారనిమిత్తము కొన్ని కోట్ల ధనము అవసరమేమిటి?

ఒక్క హేతువాది ప్రశ్నకు కూడ సరైన జవాబివ్వలేని పీఠాధిపతులు, జ్ఞానమంటే ఏమిటో తెలియని వారు ఇటు ప్రజలను అటు ప్రభుత్వమును మభ్యపెట్టడము పాపముతో కూడుకొన్న పనియే అగును. చెప్పునదే వినవలెను ప్రశ్నించకూడదను విధానము మాని సంశయములను తీర్చుటకే మేమున్నదని ప్రజలకున్న సంశయములను తీర్చి దైవత్వము వైపుకు పోవు విధానమును తెలిపితే సమాజములోనున్న క్రూరత్వము, అవినీతి, మోసము పోయి పాపబీతి ఏర్పడి సత్ సమాజము ఏర్పడగలదు.

ఇట్లు

ఇందూ ధర్మప్రదాత,

సంచలనాత్మక రచయిత, త్రైత సిద్ధాంత ఆదికర్త

**శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు**